సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం । 23 । నవంబర్‌ । 2023



కిక్కిరిసిన కురుమూర్తి

కురుమూర్తిస్వామి జాతర వైభవంగా కొనసాగుతుంది.

వివరాలు 10లో ▸



కాలినడక నుంచి..

ఎన్నికల ప్రచారంలో ప్రతిసారి వినూత్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.8 /17.6

ఉదయం, సాయంత్రం చలిగాలులు ఎక్కువగా వీస్తాయి. మధ్యాహ్నం నుంచి మేఘాలు దట్టంగా కమ్ముకుంటాయి.





మహబూబ్‌నగర్‌లో ప్రజా ఆశీర్వాదసభకు హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు

మీ తలరాత మీ చేతుల్లోనే..

మహబూబ్‌నగర్, కోస్గి ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

- బీఆర్‌ఎస్ హయాంలోనే సంక్షేమం, అభివృద్ధి
- ఆ ఫలాలు మీ కళ్లముందే ఉన్నాయి..
- ప్రతి ఒక్కరూ ఆలోచించి, జాగ్రత్తగా ఓటేయాలి
- అభివృద్ధి, సంక్షేమంపై కమిట్‌మెంట్ ఉన్న శ్రీనివాస్‌గౌడ్‌ను మరోసారి గెలిపించాలి
- మళ్లీ ఉన్నత స్థానంలో కూర్చోబెడతాం..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ మహబూబ్‌నగర్ న్యూటౌన్

'బైపాస్ రోడ్డు కావాలని నా ప్రాణం తీసి బ్రహ్మాండమైన రోడ్డు నిర్మించిండు శ్రీనివాస్‌గౌడ్. చెరువు ఎట్లా ఉండే మురికి గుట్ట.. ఇప్పుడు ఎంత సుందరంగా తయారైంది. మీ ముందు ఉన్న మయూరి ఎకో పార్కుకు కేసీఆర్ పార్కు అని పెట్టిండు. ఈ ఎకో పార్కు తెలంగాణలో ఏ నగరంలో లేదు. మీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సీఎమ్మార్‌ఎఫ్ డబ్బు ఎంత తెచ్చిండు? రూ.30 కోట్లు పంచిండు. ఐటీ టవర్ తెచ్చిండు. ఆయన కమిట్‌మెంట్ ఉన్న వ్యక్తి. రూ.10వేల కోట్లతో అమర్‌రాజా బ్యాటరీ కంపెనీ తీసుకొచ్చిండు. శ్రీనివాస్‌గౌడ్ సహకారం లేకపోతే ఆ ఫ్యాక్టరీ వచ్చేది కాదు.' అని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. ఉమ్మడి పాలమూరులో కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి, మహబూబ్‌నగర్‌లో బుధవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో ఆయన మాట్లాడారు. పాలమూరు జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఐదు వచ్చాయి. కేసీఆర్ కంటే దొడ్డుగా, పొడవుగా ఉన్న వాళ్లు గతంలో మెడికల్ కళాశాల తెచ్చారా? మంచివాళ్లు గెలిస్తే మంచి జరుగుతుంది.. చెడ్డవాళ్లు గెలిస్తే చెడు జరుగుతుంది. బీఆర్‌ఎస్ హయాంలో సంక్షేమం, అభివృద్ధి ఫలాలు మీ కళ్లముందే ఉన్నాయి. మీ తలరాత మీ చేతుల్లోనే ఉంది. గ్రామాలు, పట్టణాల్లో చర్చ పెట్టండి.. జాగ్రత్తగా ఓటేయండి' అని సూచించారు. కేసీఆర్ ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

శ్రీనివాస్‌గౌడ్‌ను గెలిపించాలి.. మళ్లీ ఉన్నత స్థానం కల్పిస్తాం..

తెలంగాణ ఉద్యమంలో భాగంగా మహబూబ్‌నగర్‌లో నేను ఎంపీగా పోటీ చేసినప్పుడు ముస్లింలందరూ మా వెంట ఉండి గెలిపించారు. మహబూబ్‌నగర్‌లో ఇప్పుడు పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి ఇంతకుముందు బీజేపీ. మళ్లీ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీలోకి వెళ్తారు. రోజుకో పార్టీ మారే వ్యక్తికి ఓటు వేసి ఆగం కావొద్దు. నేను ఎంపీగా ఉన్నప్పుడు ఈ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి కాంగ్రెస్‌కు చెందిన ఒబేదుల్లా కొత్వాల్ చైర్మన్‌గా ఉండేవారు. అప్పుడు పాలమూరులో 14 రోజులకు ఒకసారి నీళ్లు వచ్చేవి. ఎంపీ నిధులు ఎన్ని ఇచ్చినా.. ఉలుకుపలుకు లేకుండా ఉండే. నిధులు గంగలో పడేసినట్లుండే. తెలంగాణ సాధించుకున్న తర్వాత మిషన్ భగీరథతో ఇంటింటికీ రూపాయితో కనెక్షన్ ఇచ్చాం. దీంతో ప్రతి ఇంటికీ పుష్కలంగా మంచి నీరు వస్తోంది. అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై కమిట్‌మెంట్ ఉన్న మహబూబ్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను మరో సారి గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే.. ఆయనను మళ్లీ ఉన్నత స్థానంలో కూర్చోబెడతాం.

భయంకరంగా ధోకా చేశారు..

1969 తెలంగాణ ఉద్యమంలో 400 మందిని పిట్టలను కాల్చినట్లు కాల్చిచంపింద్రు. మనం ఉద్యమం మొదలు పెట్టిన తర్వాత తెలంగాణ ఇస్తామని అనడంతో మళ్లీ 2004లో కాంగ్రెస్‌తో కలిశాం. ఢిల్లీలో, రాష్ట్రంలో ఆ పార్టీనే అధికారంలో ఉంది. 2005 లేదా 2006లో తెలంగాణ రాష్ట్రం ఇవ్వాల కదా.. కానీ ఇవ్వలేదు. ధోకా భయంకరంగా మొదలుపెట్టారు. మున్సిపల్ కమిషనర్‌గా, గెజిటెడ్ అఫీసర్‌గా ఉండి రాజీనామా చేసి ఉద్యమం చేసిండు శ్రీనివాస్‌గౌడ్. ఉద్యోగులు రోడ్డు మీదుకు వచ్చారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడోనని ఆమరణ దీక్ష చేపడితే 33 పార్టీలు ముందుకు వచ్చాయి. ఆ తర్వాత దిక్కు లేక కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రం ఇచ్చింది.

■ సభలో బీఆర్‌ఎస్ జనరల్ సెక్రెటరీ కె.కేశవరావు, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, వెంకన్న, నర్సింహులు, జూపల్లి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఉన్న తెలంగాణ ఊడగొట్టిందే కాంగ్రెస్ పార్టీ

మన తెలంగాణ మనకు ఉండే. ఉన్న తెలంగాణను ఊడగొట్టి.. 58ఏళ్లు మనల్ని ఏడిపించింది కాంగ్రెస్సే. 50 ఏళ్లు ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించిన ఆ పార్టీ అనేక గోసలకు గురి చేసింది. కరువుతో పాలమూరును వలసల జిల్లాగా చేసి బొంబాయికి పోయేటట్లు చేసింది ఆ పార్టీనే. మంచీనీళ్లు ఇవ్వలేదు, సాగునీరు ఇవ్వలేదు, కరెంటు ఇవ్వలేదు. కాంగ్రెస్ రాజ్యంలో నిత్యం చేనేత కార్మికుల అకలి చావులు. రైతు ఆత్మహత్యలే. వలసలతో మన బతుకులు ఆగమయ్యాయి.



అభివృద్ధిని చూసి ఓటేయాలి

అప్పుడు బీజేపీ అభ్యర్థిగా మత రాజకీయాలు చేసిన వ్యక్తి ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తూ కుల రాజకీయాలకు పాల్పడుతున్నారని బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ప్రశాంతంగా ఉన్న పాలమూరును ఆగం చేసేందుకు కుట్ర చేస్తున్నారని, ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గూండాయిజం, రౌడీయిజం చేసే వ్యక్తుల నుంచి పెట్టుబడి తీసుకొని బరిలో నిలిచిన వ్యక్తి గెలిస్తే నియోజకవర్గాన్ని ఏడు ముక్కలుగా చేసి పంచిపెడుతారని ఆరోపించారు. దుబాయ్ వెళ్లేందుకు ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం దొరకకపోతే జెట్ ఎయిర్‌వేస్ టికెట్ తీసుకొని వెళ్లినట్లుగా ఉందని బీజేపీ అభ్యర్థిపై సెటైర్లు వేశారు. అందరి ఆశీర్వాదంతో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎంపికై మంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిషలు పని చేశానన్నారు. ఎలాంటి ఉద్యమాలు చేయకుండా కులమతాలను రెచ్చగొట్టి ఎమ్మెల్యేగా గెలిచి రెండున్నరేళ్ల ఎలాంటి సేవ చేయని వ్యక్తి రాత్రికి రాత్రి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తయిందని కాల్వల ద్వారా సాగునీరు తెచ్చి చెరువులన్నీ నింపుతామన్నారు. మహబూబ్‌నగర్‌కు ఎన్నో పరిశ్రమలు తీసుకొచ్చి స్థానిక యువతకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పొరపాటున కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే మన బతుకులు ఆగమవుతాయన్నారు. పాలమూరు పల్లెల్లో ఎక్కడ చూసినా ఇళ్లకు తాళాలు వేసి వలస వెళ్లేవారని, ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పసిడి పంటలతో సస్యశ్యామలమైందన్నారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి పాటుపడుతున్న తనకు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు.

జంగ్ తెలంగాణ



అయిజ సభలో విక్టరీ చాటుతున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాణిక్‌రావుఠాక్రే, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, విజయశాంతి, సంపత్‌కుమార్



కాంగ్రెస్‌ను గెలిపించే బాధ్యత మీదే

అయిజ ప్రజాగర్జన సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

- రాష్ట్రంలో ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకమైనవి
- అవినీతి సామ్రాజ్యాన్ని కూలదోసి..
- ప్రజాహితమైన కాంగ్రెస్ పాలన తీసుకువద్దాం

అలంపూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించే బాధ్యత మీదేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అలంపూర్ ప్రజాగర్జన సభ బుధవారం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్‌కు మద్దతుగా నిర్వహించిన సభకు ఖర్గేతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, నల్లగొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల ప్రతిష్టాత్మకమైనవి అన్నారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు బాగు చేయలేదని, రోడ్లు, విద్యాలయాలు మెరుగుపర్చలేదన్నారు. అలంపూర్ పవిత్రమైన ప్రదేశం అని.. కృష్ణ– తుంగభద్ర నదుల సంగమం ఇక్కడ ఉందన్నారు. ఈ సంగమ ప్రదేశంలో మనం కలుస్తున్నాం.. కాంగ్రెస్ ఇక్కడ బలంగా నిలబడితే యావత్ దేశంలో ప్రతిబింబిస్తుందని జోస్యం చెప్పారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులు సంతోషంగా ఉండేవారని, పేదలకు తినడానికి తిండి దొరికేదన్నారు. దేశంలో ఎవరూ ఆకలితో అలమటించలేదని, అందుకే ఇందిరాగాంధీ గరీబ్ హటావో నినాదం తీసుకు వచ్చారన్నారు. కేసీఆర్ ఇందిరాగాంధీని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. నేను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో టీఆర్‌ఎస్‌లో ఇద్దరు ఎంపీలు ఉండేవారని, అందులో ఒకరు కేసీఆర్ కాగా మరొకరు విజయశాంతి అన్నారు. విజయశాంతి వెల్‌లోకి వెళ్లి తెలంగాణ ఇవ్వాలని కోరితే.. నాలుగైదు గంటలు అక్కడే ఉండి తెలంగాణ వాదాన్ని వినిపించారని గుర్తు చేశారు. ఆ సమయంలో కేసీఆర్ ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. ఇప్పుడు తెలంగాణ ఫలాలు కేసీఆర్, ఆయన కుటుంబం అనుభవిస్తోందని, తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీని గుర్తించుకోవడం లేదని దుయ్యబట్టారు. అడ్డగోలుగా సంపాదిస్తూ ప్రజల రక్తం తాగి ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ కోసం పోరాటం చేశాం.. ఇప్పుడు తెలంగాణలోని దుర్మార్గపు ప్రభుత్వాన్ని అంతమొందించడానికి పోరాటం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పేదలకు మద్దతుగా ఉంటే.. కేంద్రంలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్పొరేట్‌లకు అండగా ఉన్నారని దుయ్యబట్టారు. అవినీతి సామ్రాజ్యాన్ని కూలదోసి ప్రజాహితమైన రాజ్యాంగబద్ధ కాంగ్రెస్ పాలన రావాలన్న ఆకాంక్షతో ముందుకు పోతున్నట్లు వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతంలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావాలి



ప్రజల బతుకులు మారాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని నల్లగొండ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్కరికి ఉద్యోగాలు రాలేదని, ఒక్కరు ఇళ్లు కట్టుకోలేదన్నారు. రైతులకు రూ.లక్ష రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదన్నారు. కేసీఆర్ కుటుంబం ఒక్కటే బంగారు కుటుంబమైందన్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం అసెంబ్లీలో కొట్లాడి సాధించుకుంటే దాన్ని పూర్తి చేయలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేస్తామన్నారు. అసెంబ్లీలో కొట్లాడితే నాది సంపత్‌కుమార్ అసెంబ్లీ సభ్యత్వం రద్దు చేశారని, దేశ చరిత్రలో ఎక్కడా ఇలా జరగలేదన్నారు. తెలంగాణ ప్రకటన వచ్చిన రోజు, సోనియా గాంధీ పుట్టిన రోజున తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. అలంపూర్ అభివృద్ధి కోసం సంపత్‌కుమార్‌తో పాటు కలిసి పనిచేస్తామన్నారు.

యుద్ధానికి సిద్ధంగా ఉండాలి



ప్రజలు అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి అన్నారు. రాష్ట్రంలో దొరను దింపుతామని చాలెంట్ చేయాలన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో అభివృద్ధి జరగలేదన్నారు. నాలుగు కోట్ల మంది ప్రజలు నలుగురుగా ఉన్న కేసీఆర్‌పై దండయాత్ర చేయాలన్నారు. బీజేపీ 420 పార్టీతో కుమ్మక్కై ఒదన్నారు. ఈసారి సామ ధాన బేధ దండోపయాలు ప్రయోగించి బీజేపీ కేసీఆర్‌ను మరోసారి గద్దెమీద ఎక్కించడానికి కుట్ర పన్నుతుందని, ప్రజలు వీటిని తిప్పికొట్టాలన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఇస్తే మీరు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తామని గ్యారెంటీ ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్ గ్యారంటీలను ఎవరూ నమ్మరు



తిమ్మాజీపేట మండలం అప్పాజిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: ఇల్లు, కుటుంబాన్ని వదిలేసి వలస వెళ్లిన వారిని ఆ రోజు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదు.. గతంలో రైతులు కరెంటు అడిగితే కాల్చి చంపిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. గతంలో వానలు లేక కప్పల పెళ్లిళ్లు చేశారని, వ్యవసాయానికి కూడా నీళ్లు లేకపోయేదన్నారు. కాని నేడు కాల్వల ద్వారా, ప్రాజెక్టుల ద్వారా పుష్కలంగా నీళ్లు వచ్చి వ్యవసాయం పండుగ అయిందన్నారు. బుధవారం తిమ్మాజీపేట మండలంలోని చేగుంట, గోరిట, గుమ్మకొండ, అప్పాజీపల్లి గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆయా గ్రామాల మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వారు ఆ రోజుల్లో రైతుల కళ్లలో కన్నీళ్లు తెప్పించారని, కాని నేడు తాను కందనూలు కాల్వల్లో నీళ్లు తెప్పించానని అన్నారు. గ్యారంటీ లేని పార్టీ గ్యారంటీలను ఎవరూ నమ్మరని, కర్ణాటకలో ఇచ్చిన కాంగ్రెస్ గ్యారంటీలకే దిక్కు లేదని, తెలంగాణలో ఎలా ఇస్తారని ఆరోపించారు. గతంలో రైతులు పండించిన పంటను కాంగ్రెస్ ప్రభుత్వం కొనలేదన్నారు. నేడు రైతులకు పెట్టుబడి సాయం కింద రైతుబంధు, ఏదైన కారణంతో రైతు చనిపోతే బీమాగా రూ.5 లక్షలు వస్తుందన్నారు. గతంలో రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందకపోయేవన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి వదిలేశారని, తాగడానికి నీళ్లు, సాగునీళ్లు కూడా ఉండేవి కాదన్నారు. గతంలో ఆడబిడ్డ పెళ్లి చేయాలంటే భూమి అమ్మేవారని, పెళ్లికి చేసిన అప్పులు తీర్చడం కోసం రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్ర కల సాకారం అయిన తర్వాత సీఎం కేసీఆర్ వ్యవసాయాన్ని పండగలా చేశారని అన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంటు, సాగు నీళ్లు, సరైన సమయంలో విత్తనాలు, ఎరువులు అందజేశామన్నారు. ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, దివ్యాంగులు, వృద్ధులకు పింఛను, కేఎల్ఐ ద్వారా 80శాతం సాగునీరు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో తిమ్మాజీపేట బీఆర్‌ఎస్ మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

■ ఒక నాడు నాగర్‌కర్నూల్‌కు మెడికల్ కళాశాల వస్తే అప్పటి నాయకులు దానిని అమ్ముకున్నారని, కానీ నేను ఈ రోజు నాగర్ కర్నూల్‌కు మెడికల్ కళాశాల తెచ్చానన్నారు. ఇప్పుడు అంబేడ్కర్ సాక్షిగా చేప్తున్న.. ఈ సారి నన్ను మీరు గెలిపించుకుంటే ఇంజినీరింగ్ కళాశాల తెస్తానని అన్నారు.

పీఓలు బాధ్యతగా వ్యవహరించాలి

నాగర్‌కర్నూల్: ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారుల (పీఓల)దేనని అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు సతీష్ కుమార్ అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అచ్చంపేట నియోజకవర్గానికి కేటాయించిన ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. పోలింగ్‌కు ఒకరోజు ముందు, పోలింగ్ రోజు ఎన్నికల సిబ్బంది చేయాల్సిన పనులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడారు. ఎన్నికలకు సంబంధించి ప్రతి విషయాన్ని తెలియజేసే హ్యాండ్ బుక్‌లను తప్పనిసరిగా సరిచూసుకోవాలన్నారు. పీఓలు, ఏపీఓలు, పోలింగ్ సిబ్బంది డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి తీసుకెళ్లే ఎన్నికల సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి వెళ్లాల్సి ఉంటుందన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అచ్చంపేట రిటర్నింగ్ అధికారి గోపిరామ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి నర్సింగ్ రావు, తహసీల్దార్లు తబిత, సలీముద్దీన్, మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్, శ్రీకాంత్, రాఘవేందర్ పాల్గొన్నారు.

ప్రచార లెక్కలు నమోదు చేయండి

నాగర్‌కర్నూల్: అభ్యర్థుల ప్రచార లెక్కలను తప్పనిసరిగా నమోదు చేయాలని ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ భేరారామ్ చౌదరి అన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల ఎక్స్‌పెండిచర్ బుధవారం అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాలను అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అభ్యర్థులు ప్రచారాల కోసం వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం కోసం చేసే ఖర్చుల వివరాలను పక్కాగా వెల్లడించాలని సూచించారు.

సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం: అసెంబ్లీ ఎన్నికల్లో శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ముందు నుంచే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా పెంచాలని జిల్లా పోలీసు ఎన్నికల అబ్జర్వర్ ఇలియాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయ సమావేశ హాలులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర, కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా వారిలో భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాలన్నారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ.. జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్ర బలగాలను కేటాయించారని, మరికొందరిని పోలింగ్ సమయం వరకు బందోబస్తుకు రానున్నట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, భరత్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించుకోవాలి

నాగర్‌కర్నూల్: జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలో మంగళవారం నుంచే హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. పోలింగ్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించుకోవాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో జరిగే హోం ఓటింగ్, పోస్టల్ ఓటింగ్‌కు సంబంధించిన పూర్తి ప్రక్రియను, ఓటింగ్ అంశాలను రాజకీయ పార్టీలకు ముందస్తుగానే తెలియజేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ హోం ఓటింగ్ పోలింగ్ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామన్నారు. కలెక్టరేట్‌తో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహిస్తున్నామని, పోలీస్ భద్రతతో, పూర్తిగా వీడియో కవరేజ్ చేస్తున్నట్లు చెప్పారు. కొల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల్లో పోటీలో ఉన్న శిరీష(బర్రెలక్క) కుటుంబ సభ్యులపై జరిగిన దాడి ఘటనను రాజకీయ పార్టీల ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జరిగిన ఘటనను ఆధారం చేసుకుని శిరీషకు భద్రత కల్పించాలని ఎస్పీకి ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలియజేశారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలి..

ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది ఫాం 12 ద్వారా దరఖాస్తు చేసుకున్న పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని జి 17 నంబర్లు ఏర్పాటు చేసిన ఇతర జిల్లాల నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించి మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న వివిధ జిల్లాలకు చెందిన ఉద్యోగస్తులు కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను సందర్శించి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా నుంచి 29 నియోజకవర్గాలకు పోస్టల్ బ్యాలెట్ పంపాల్సి ఉందన్నారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు చెందిన 292 మంది ఓటర్లు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోగా ఇతర జిల్లాల నియోజకవర్గాలకు చెందిన 43 మంది ఓటర్లు తమ పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నట్లు వివరించారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి పి.ఉదయ్ కుమార్ అన్నారు. కేంద్ర ఎన్నికల డిప్యూటీ కమిషనర్ నితీష్ వ్యాస్ తెలంగాణలోని జిల్లా ఎన్నికల అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటి వరకు చేపట్టిన చర్యలపై వివరాలు సేకరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి పి.ఉదయ్ కుమార్ వివరించారు. ఇప్పటి వరకు జిల్లాలో 5 లక్షల ఎపిక్ కార్డులు పోస్ట్ ద్వారా పంపించామని, మరో రెండు లక్షల ఎపిక్ కార్డులు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 16,182 కొత్త ఎపిక్ కార్డులు ప్రింటింగ్‌కు ఇచ్చామన్నారు. ఫారం 12 ద్వారా 5,020 దరఖాస్తులు వచ్చాయని, పోలింగ్ సిబ్బంది, ఆబ్సెంట్ ఓటర్లకు పోలింగ్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్ వేయిస్తామన్నారు. అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, కే.సీతారామ రావు, రిటర్నింగ్ అధికారులు వెంకటరామ రెడ్డి, గోపిరామ్ పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన తప్పనిసరి

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలక్ట్రానిక్ యంత్రాల విషయంలో ప్రతి విషయంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అచ్చంపేట నియోజకవర్గానికి సంబంధించిన ప్రిసైడింగ్ సహాయ, ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎంలపై రెండో విడత ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ హాజరై ఈవీఎంల నిర్వహణ తదితర అంశాలను వివరించారు. పోలింగ్ అనంతరం చెక్‌లిస్ట్ ప్రకారం అందజేయాల్సిన వివిధ పత్రాలపై, 32 ట్రైనింగ్ ఈవీఎంలతో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు.

సీ విజిల్ ఫిర్యాదులను పరిష్కరించాలి

సీ విజిల్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుకు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ ఆదేశించారు. సి విజిల్ ఫిర్యాదుల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. 168 ఫిర్యాదుల అంశాలను ఆయన సమీక్షించారు. అందులో 70 ఫిర్యాదులను పరిష్కరించగా.. 85 ఫిర్యాదులు సంబంధం లేని విధంగా వచ్చిన కారణంగా డ్రాప్ చేశామన్నారు. అప్పుడే వచ్చిన 13 ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపించామని ఈడీయం నరేష్ వివరించారు.

పోలింగ్ బూత్‌లో ప్రత్యేక నిబంధనలు

అచ్చంపేట: ఎన్నికల పోలింగ్ రోజున బూత్‌కు వచ్చిన ఓటరు గోప్యతను పాటించకుండా ఓటును బహిర్గతం చేయడానికి ప్రయత్నిస్తే.. ఎన్నికల నిబంధనలు ఉల్లఘించినట్లుగా అధికారులు భావించి సదరు వ్యక్తి ఓటును వేయడానికి అనుమతించరు. అలాగే అంధుడై ఉండి, ఎన్నికల గుర్తును గుర్తించలేని పరిస్థితి ఉంటే.. అతనితోపాటు ఓవ్యక్తిని పోలింగ్ బూత్‌లోకి అధికారులు అనుమతిస్తారు. అంధత్వ వ్యక్తికి సహాయంగా వెళ్లే వ్యక్తికి 18 ఏళ్లు నిండి, ఏదేని గుర్తింపు కార్డు తీసుకువస్తేనే అనుమతిస్తారు. అలాగే ఒక వ్యక్తి ఓటు వేయడానికి వచ్చినప్పుడు అతడి ఓటును అప్పటికే ఎవరైనా వేస్తే, టెండర్ ఓటుగా పరిగణించి, పోలింగ్ అధికారుల వద్ద ఉండే బ్యాలెట్ పేపర్‌లో ఒక పేపర్ ఇస్తే, దానిపై పాత పద్ధతిలో ఓటు వేయవచ్చు. ఎవరైనా ఓటు వేయడానికి వచ్చినప్పుడు బోగస్ ఓటని, తక్కువ వయస్సు అని పోలింగ్ ఏజెంట్లు ఛాలెంజ్ చేస్తే పోలింగ్ అధికారి ఏజెంట్ నుంచి విషయాలు సేకరిస్తారు. ప్రాథమిక విచారణ చేసి, ఆరోపణ నిజమైతే సదరు ఓటర్‌ను పోలీస్ సిబ్బందికి అప్పగిస్తారు. ఒక ఓటర్ తాను నచ్చిన పార్టీకి ఓటు వేస్తే, అది వేరే పార్టీకి పడ్డట్లు ఆరోపణలు చేస్తే అధికారులు టెస్టు ఓటుకు అనుమతిస్తారు. అయితే ఆ ఆరోపణ రుజువు కాకుంటే చర్యలు తీసుకుంటామని కూడా సదరు ఓటర్‌ను ముందే హెచ్చరిస్తారు.

జంగ్ తెలంగాణ

ఎన్నికల వరుసలు



నవాబుపేట: చిచ్చా బాగున్నావా.. మావా ఎక్కడ పోతున్నావ్.. ఓ అక్కా నీ బిడ్డ మంచిగ చదువుతుండా.. మొన్న వడ్లు ఎన్ని పండినాయి... తాతా పాణం బాగుందా.. ఇలా రకరకాల పలకరింపులతో గ్రామాలు పులకరిస్తున్నాయి. ఎప్పుడు కోడి కూతతో లేచే ఊరు కాస్తా ఈ మధ్య కొత్త కొత్త నాయకుల పలకరింపులతోనే నిద్ర లేస్తుండటం విశేషం. ఉదయం లేవగానే కొత్త కొత్త మనుషులు. కొత్త వరుసలతో పలకరించటంతో జనం ఉబ్బి తబ్బిపోతున్నారు. కొందరు ఇదేంరా బాబు ఎన్నడూ లేని వీడు వరుస కలుపుతున్నాడంటూ లోలోనే గొనుగుతున్నారు. ఓటర్లకు దగ్గరయ్యేందుకు వివిధ పార్టీల నాయకులు వరుసలు కలిపేస్తూ జనాలను మచ్చిక చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కాగా కొందరు వీరి జిమ్మికులు మాకు తెలుసులే అని అంటున్నారు.

కాషాయ జెండా ఎగరేద్దాం



మక్తల్ బహిరంగ సభలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్



మక్తల్‌లో బహిరంగ సభకు హాజరైన జనం

- బీజేపీ అధికారంలోకి వస్తే ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం
- జీఓ 69ను అమలుచేసి సాగునీరు అందిస్తాం
- రెవెన్యూ డివిజన్‌గా మక్తల్ ఏర్పాటు
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

నారాయణపేట/మక్తల్: ఈ ప్రాంతం బీజేపీకి కంచుకోట.. అనాదిగా సర్పంచ్‌లు.. ఎంపీటీసీలు.. కౌన్సిలర్లు.. ఎంపీపీలు.. జెడ్పీటీసీలుగా.. మున్సిపల్ చైర్మన్లను గెలిపించుకున్నది మక్తల్ గడ్డ.. ఎండలో తలపై టోపీలు పెట్టుకొని కూర్చుంటే కాషాయ వనంలా కనిపిస్తోంది.. ఈ ప్రాంతం కాషాయానికి అడ్డా.. ఇక్కడ ఎగిరేది కాషాయ జెండా.. గెలిచే పార్టీ బీజేపీ అని.. రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార బహిరంగ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మక్తల్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని అనేక రోజులుగా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారని.. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే ఆ కోరిక నెరవేరుస్తామని హామీ ఇచ్చారు.

జీఓ 69తో సాగునీరు..

బీజేపీ అధికారంలోకి రాగానే రూ.1,400 కోట్ల నిధులు కేటాయించి జీఓ 69ను అమలు చేసి నాలుగు మండలాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తామని ఈటెల భరోసా ఇచ్చారు. మాదాసి కురువలు ఈ ప్రాంతంలో వెనకబడ్డారని, కేసీఆర్ ఎస్టీ సర్టిఫికెట్ ఇస్తామని చెప్పినా.. ఒకటే కులంలో కొంత మందికి ఇచ్చి.. మరి కొంతమందికి ఇవ్వడం లేదని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. నరేంద్రమోదీ కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదోళ్ల కోసమే పుట్టినా.. పేదోళ్ల కోసమే పదవిలో ఉన్నా.. పేదోళ్ల కోసమే సచ్చిపోతా అన్న కేసీఆర్ సొంతింటి కల నెరవేర్చాడా అని ప్రజలను అడిగారు. హైదరాబాద్‌లో అర్బన్ హౌస్ కింద 2.50 లక్షల ఇళ్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే 1.35 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మించారని, అవి కూడా పేదలకు కాకుండా.. బీఆర్‌ఎస్ నాయకులకు, డబ్బులు ముట్టజెప్పిన వాళ్లకు ఇచ్చి పేదలకు అన్యాయం చేశారని విమర్శించారు. మక్తల్, నారాయణపేట ప్రజలకు హామీ ఇస్తున్నా.. బీజేపీని గెలిపించండి సొంతింటి కల నెరవేర్చే బాధ్యత మా చేతుల్లో పెట్టండని కోరారు.

⇨ నారాయణపేట, మక్తల్‌లో దళిత బిడ్డలకు దళితబంధు వచ్చిందా అని ప్రశ్నించారు. దళితబంధు ఇచ్చింది ప్రేమతో కాదు.. హుజూరాబాద్‌లో ఈటెల రాజేందర్‌ను ఓడగొట్టేందుకు పాస్ పుస్తకాలు ఇచ్చి.. దేవుళ్ల ప్రమాణం చేసిండు.. ఈటెలను అసెంబ్లీలో ముఖం చూపించరాదని తీసుకువచ్చిండన్నారు. ఈసారి ఎన్నికల్లోనూ సీఎం కేసీఆర్ డబ్బులు, మద్యంనే నమ్ముకున్నాడని ఆరోపించారు. ఆరు నెలలకు ఒకసారి ఖాళీ ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఖాళీ ఉద్యోగుల జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు. ఉద్యోగాలు రాకపోతే ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు బ్యాంకుల ద్వారా ప్రభుత్వమే గ్యారంటీ ఇచ్చి రుణాలు అందజేసి బతుకుదెరువుకు భరోసా కల్పిస్తామన్నారు.

విద్య, వైద్యం అభివృద్ధే ధ్యేయం

నరేంద్రమోదీ వచ్చినప్పుడు నువ్వు రాజేందర్ ఆరోగ్య, ఆర్థిక మంత్రిగా ఇన్నేళ్లు ఫ్లోర్ లీడర్‌గా పని చేసినవ్ తెలంగాణకు ఏం చేస్తే బాగుపడుతుందని అడిగారు.. సార్.. మాకు వైద్యంతో పాటు మా గ్రామీణ, పట్టణాల్లో బస్తీల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం విద్య ఇవ్వాలని కోరగా.. హామీ ఇవ్వ అమలు చేస్తామని మాటిచ్చారని పేర్కొన్నారు.

వరికి రూ.3,100 మద్దతు ధర

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే క్వింటా వరి ధాన్యాన్ని మద్దతు ధర రూ.3,100కు కొంటామని ఈటల రైతులకు భరోసా ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ నిర్ణయిస్తుంది.. వరికి రూ.2,200కు అమ్ముతున్నాం.. రంగు మారిందని.. మొలకలు వచ్చాయని, రైస్ మిల్లర్లు క్వింటాకు మూడు, ఆరు కిలోల తరుగు తీస్తున్నారని అసెంబ్లీలో సీఎంను అడిగినా స్పందించలేదని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వస్తే క్వింటాకు రూ.3,100 కొంటామన్నారు. కేసీఆర్ ఇచ్చే ఎకరాకు రూ.5 వేలు.. అదే నరేంద్రమోదీ పంటకు ఎరువులపై రూ.9 వేల సబ్సిడీ ఇస్తున్నారన్నారు. రైతుబంధు ఇస్తున్నానని చెప్పి మిగతా సబ్సిడీ పథకాలు అన్నీ ఎత్తివేశారని ఆరోపించారు. నారాయణపేటలో రతంగ్‌పాండురెడ్డి, మక్తల్‌లో జలంధర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గోవా ఎమ్మెల్యే, పేట ఎన్నికల ఇన్‌చార్జ్ కృష్ణ, మక్తల్ ఎన్నికల ఇన్‌చార్జ్ ఎంపీ మునిస్వామి, బీజేపీ రాష్ట్ర నాయకులు నాగూరావు నామాజీ పాల్గొన్నారు.

ఎన్నికల సిత్రాలు..



ధాన్యం తూకం వేస్తాం.. ఓట్లు రాబడతాం

పాన్‌గల్ మండలంలోని శాగాపూర్‌లో కొల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ నాయకులు కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని సంచుల్లో నింపి తూకం చేస్తూ రైతులను ఓటర్లను ఆకర్షించారు.

– పాన్‌గల్

అవ్వ 'కారు'ను మరువొద్దు..

అవ్వ యాది ఉంచుకుని మరొకసారి కారు గుర్తుకు ఖచ్చితంగా ఓటేయ్యాలే అని దేవరకద్ర బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. కొత్తకోట మండలంలోని రేకులంపల్లి, పేరూర్‌లో ప్రచారం నిర్వహించారు.

– దేవరకద్ర రూరల్





గ్యారం'టీ'లను అమలు చేస్తాం

దేవరకద్ర కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జీ.మధుసూదన్‌రెడ్డి అడ్డాకుల మండలంలో ప్రచారం చేశారు. ఓ హోటల్‌లో టీ తాగే సమయంలో కాంగ్రెస్ ఆరు గ్యారం'టీ'లను చూపిస్తూ ఎన్నికల రోజు వాటిని మర్చిపోవద్దని కోరారు.

– అడ్డాకుల

జోల పాడుతా..

ఆత్మకూర్ మున్సిపాలిటీలోని ఖానాపూర్‌లో మక్తల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఏడుస్తున్న చిన్నారిని తీసుకుని జోలపాడుతూ ఓదార్చారు. జోలినిండా ఓట్లు పడాలని ఓటర్లను అభ్యర్థించారు.

– ఆత్మకూర్





ఆశీర్వాదం తీసుకో.. నాకే నీ ఓటు

రాజాపూర్ మండల కేంద్రంలో ప్రచారంలో భాగంగా జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్ రెడ్డి నూతన వధూవరూలను ఆశీర్వదించారు. వైవాహిక జీవితంలో సంతోషంగా ఉంటూ.. మీ ఓటు తప్పకుండా నాకే వేయాలని కోరారు.

– రాజాపూర్

జ్ఞాపిక అందుకో.. హస్తం గుర్తుంచుకో..

దామరగిద్ద మండలంలోని గత్ప గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తి సేవా సంఘం ఆధ్వర్యంలో నారాయణపేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఫర్ణికారెడ్డికి జ్ఞాపికను అందజేశారు. హస్తం గుర్తుకు ఓటేసి గెలిపించాలంటూ ఆమె అభ్యర్థించారు.

– నారాయణపేట



కిక్కిరిసిన కురుమతి కొండలు

- మార్మోగిన గోవింద నామస్మరణ

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తిస్వామి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామివారి దర్శనానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు ఆలయ శుద్ధి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు మెట్లపై కొబ్బరికాయలు కొట్టి గోవింద నామస్మరణ చేస్తూ స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు తలనీలాలు, నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

హుండీ లెక్కింపు..

బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయ హుండీని అధికారులు లెక్కించారు. మొత్తం రూ.20,69,089 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు నాగరాజు, వడ్డెమాన్ నాగరాజు, శేఖర్‌రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారి హుండీ లెక్కింపు

కాలినడక నుంచి.. హెలీకాప్టర్ల వరకు

- ప్రచార శైలిలో వచ్చిన మార్పులు



అచ్చంపేట: ఎన్నికల ప్రచారంలో ప్రతిసారి వినూత్న మార్పులు కనిపిస్తున్నాయి. నాడు అభ్యర్థులు కాలినడకన గ్రామాలను చుట్టేసేవారు. ఆ తర్వాత ఎడ్లబండ్లు, సైకిళ్లు, మహా అయితే జీపుల్లో గ్రామాలు, పట్టణాల్లో అభ్యర్థులు తిరిగి ఎన్నికల ప్రచారం చేపట్టేవారు. రానురాను జీపుల వినియోగం పెరిగింది. అనంతరం అంబాసిడర్ కార్లు వచ్చాయి. ప్రస్తుతం ఖరీదైన కార్లు, ఇతర వాహనాలను ప్రచారాలకు ఉపయోగిస్తున్నారు.

పల్లెల్లో వాహనాల బారులు..

జిల్లాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అధునాతన వాహనాలనే వినియోగిస్తున్నారు. పల్లెల్లో ఖరీదైన కార్లు బారులు తీరుతున్నాయి. ఏ గ్రామానికి వెళ్లినా అభ్యర్థి వెంట పదుల సంఖ్యలో కార్లు కనిపిస్తున్నాయి. ప్రతి దాంట్లో ముఖ్య అనుచరులు వెళ్లి బలగాన్ని చూపుతూ ప్రజలకు చేరువవుతున్నారు.

ప్రముఖులు ఆకాశమార్గాన..

పార్టీ అధ్యక్షులు, ప్రముఖులైతే సభలకు హెలికాప్టర్‌ను వినియోగిస్తున్నారు. వంద కిలోమీటర్ల దూరంలో సభలు ఉంటే కార్లలో వెళ్తే సమయానికి చేరుకునే అవకాశం ఉండదు. తక్కువ సమయంలో ఎక్కువ సభలను చుట్టేసేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీల అధ్యక్షులు, ప్రముఖులు హెలికాప్టర్లను వాడుతున్నారు. రోజూ మూడు, నాలుగు సభల్లో పాల్గొంటున్నారు. నాడు ఎంత పెద్ద సభ అయినా వాహనాల్లో వెళ్లేవారు. నేడు క్షణాల్లో ఆకాశమార్గాన సభల ముందు వాలిపోతున్నారు.

చెట్లనీడ పోయి.. షామియానాలొచ్చే

తొలినాళ్లలో చెట్లకింద, రచ్చబండల వద్ద పగలు సభలు, సమావేశాలు నిర్వహించేవారు. విశాలమైన మైదానాల్లో సభలు, సమావేశాలు నిర్వహించేవారు కాదు. నియోజకవర్గానికి సంబంధించిన సభలు, సమావేశాలను గ్రామశివారులోని మర్రిచెట్లు, ఇతర వృక్షాల కిందనే ఏర్పాట్లు చేసుకునేవారు. నేలపైనే కూర్చొని ప్రజలు నేతల ప్రసంగాలు వినేవారు. టెంట్లు ఉండేవి కావు. నాటి పరిస్థితులకు భిన్నంగా ప్రస్తుతం సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. పెద్ద మైదానాల్లో షామియానాలు(టెంట్లు) ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. సభ సమయంలోనూ మార్పులు వచ్చాయి. ప్రస్తుతం సాయంత్రం 4గంటలకు సభలు నిర్వహిస్తున్నారు. రాత్రి వెలుగులు పంచడానికి ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తగా ప్రచార పాటలు, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ప్రచార పాటల్లోనూ మార్పులు వచ్చాయి. గతంలో కళాకారులు అప్పటికప్పుడు డప్పు చప్పుళ్లతో పాటలు పాడేవారు. ప్రతి పార్టీకి కళాకారుల బృందం ఉండేది. అభ్యర్థులు గ్రామానికి చేరుకునే గంట, రెండు గంటల ముందు కళాకారులు వచ్చి తమ పాటలతో ఉత్సాహపరిచేవారు. నేడు అలాంటి పరిస్థితి ఏమీ లేదు. కానీ రికార్డింగ్ పాటలతో ప్రత్యేక రథాలను గ్రామాలు, పట్టణాల్లోని వీధుల్లో తిప్పుతున్నారు. అభ్యర్థి సేవలు, చేపట్టిన అభివృద్ధిపై రికార్డు చేసిన పాటలతో హోరెత్తిస్తున్నారు. కొందరు నాయకులు ఎల్‌ఈడీ స్క్రీన్ వాహనాల ద్వారా నేతల ప్రసంగాలను వినిపిస్తున్నారు.

బర్రెలక్క తమ్ముడిపై దాడి సరికాదు

కొల్లాపూర్: నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన కర్నె శిరీష అలియాస్ బర్రెలక్కకు ప్రముఖుల నుంచి మద్దతు పెరుగుతుంది. ఎన్నికల ప్రచారంలో ఉండగా ఆమె తమ్ముడు భరత్‌పై పెద్దకొత్తపలి మండలం వెన్నచెర్లలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గానికి చెందిన కొందరు నాయకులు తాను ఓట్లు చీల్చుతాననే భయంతో దాడులకు తెగబడుతున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది సరికాదని శిరీష వాపోయింది. ఆమె తమ్ముడిపై దాడిని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా తప్పుబట్టారు. ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా నిర్వహించాలని, పోటీలో ఉన్న వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్పందిస్తూ ఈ దాడి అత్యంత బాధాకరమన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆమెకు, కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన డీజీపీ, ఎన్నికల ప్రధాన కార్యదర్శిని కోరారు. సీపీఎం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు, పలు ప్రజా సంఘాల నాయకులు దాడిని ఖండించారు. కొల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్‌రెడ్డి కూడా దాడి హేయనీయమన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించాలని, మహిళా అభ్యర్థిపై దాడికి ప్రయత్నించడం, ఆమె సోదరునిపై దాడికి పాల్పడడం దారుణమన్నారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో మంచి పరిణామం కాదన్నారు. ఈ దాడి ఘటనపై కొల్లాపూర్‌లో సోషల్‌మీడియాలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి.

పాముకాటుతో మహిళ మృతి



అక్కెమ్మ(ఫైల్)

నర్వ: పాము కాటుకు గురై మహిళ మృతిచెందిన సంఘటన నర్వ మండలం పెద్దకడ్మూర్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకడ్మూర్‌కి చెందిన ఎల్లంపల్లి కుర్వ అక్కెమ్మ(45) తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లింది. అక్కడ మోకాలి వద్ద పాము కాటు వేయడంతో భయంతో ఇంటికి వచ్చింది. చుట్టుపక్కల వారు వెంటనే ఆమెను మక్తల్ మండలం గుడిగండ్ల వద్ద నాటువైద్యానికి తీసుకెళ్లినట్లు సమాచారం. అక్కడ పరిస్థితి విషమించడంతో నర్వ పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. ఇక్కడి వైద్య సిబ్బంది మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ప్రైవేటు వాహనంలో తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్తతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..



బాలప్ప (ఫైల్)

మద్దూరు: మండలంలోని పెదిరిపాడుకు చెందిన మాడుగుల బాలప్ప(52) కర్ణాటకలోని ముదేశ్ పోలీస్‌స్టేషన్ పరిధి పాకాల శివారులో అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. పని నిమిత్తం మంగళవారం ముదేశ్ వెళ్తున్నట్లు ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లాడు. బుధవారం పాకాల శివారులో మృతిచెంది కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పోస్టు చేయడంతో పెదిరిపాడు వాసిగా గుర్తించారు. పెద్ద కుమారుడు గొల్ల కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ముదేశ్ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

చెరువులో పడి మరొకరు..

మహమ్మదాబాద్: పొలానికి వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో శవమై కనిపించిన ఘటన గండేడ్ మండలం జంగంరెడ్డిపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ సురేశ్ కథనం మేరకు.. జంగంరెడ్డిపల్లికి చెందిన కోస్గి అంజిలయ్య (58) వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నెల 20న పొలానికి వెళ్లిన అంజిలయ్య సమీపంలో ఉన్న చెరువులో పడిపోయాడు. రెండ్రోజులుగా కుటుంబీకులు ఎక్కడ వెదికినా ఆచూకీ లభించలేదు. బుధవారం చెరువులో మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. భార్య పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

పాన్‌గల్: అనారోగ్యం కారణంతో మనస్తాపం చెంది ఓ వివాహిత ఉరేసుకుని మృతిచెందిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కేతేపల్లికి చెందిన కాకం కాశమ్మ(38) కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో కూలి పనులు చేస్తూ.. జీవనం సాగిస్తున్నారు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్ నుంచి మంగళవారం సొంత గ్రామానికి చేరుకుంది. మనస్తాపంతో బుధవారం తెల్లవారుజామున ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈమె మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, అనారోగ్యంతోనే ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అంబులెన్స్ డ్రైవర్లు రోగుల సమాచారం ఉండాలి



పాలమూరు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో అంబులెన్స్‌లలో ఎన్నికలకు సంబంధించిన మెటీరియల్, నగదు సరఫరా చేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు జిల్లాలోని అన్ని రకాల అంబులెన్స్ నిర్వాహకులు జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి అంబులెన్స్ డ్రైవర్ మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌తోపాటు ఇతర పట్టణాలకు రోగులను తీసుకువెళ్తున్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రోగి కేస్‌షీట్, ఏ ఆస్పత్రికి వెళ్తుంది ఇతర వివరాలు వెంట తీసుకువెళ్లాలన్నారు. కేస్‌షీట్‌తోపాటు సంబంధిత ఆస్పత్రుల సమాచారం లేకుండా వెళ్తే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం ప్రాజెక్టుకు 1,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు తెలిపారు. ఆవిరి రూపంలో 111 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 820 క్యూసెక్కులు, కుడి కాల్వకు 639 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,885 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.836 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ దుర్మరణం

కొత్తకోట రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని కానిస్టేబుల్ మృతిచెందిన ఘటన మండలంలోని విలియంకొండ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు.. వనపర్తి మండలం శ్రీనివాసాపురం గ్రామానికి చెందిన బాలరాజు (35) పెద్దమందడి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తుండేవాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకొని అత్తగారి ఊరైన పెబ్బేరుకు బైక్‌పై వెళ్తుండగా విలియంకొండ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాలరాజుకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.



బాలరాజు (ఫైల్)